క్లుప్తంగా

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఇల్లంతకుంట: సీపీఆర్‌పై అందరికీ అవగాహన ఉండాలని జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు అన్నారు. మండల కేంద్రంలోని వైశ్య భవన్‌లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం సీపీఆర్ కార్డియో పల్మనరీ రిసస్టిటేషన్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీపీ వెంకటరమణారెడ్డితో పాటు హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రజల జీవన శైలి మారడంతో పాటు ఒత్తిడితో కూడిన జీవితం వల్ల గతంలో కంటే ఎక్కువ గుండెపోట్లు పెరిగాయని, సడెన్ కార్డియాక్ అరెస్టు వచ్చినప్పుడు ఏం చేయాలో అవగాహన లేకపోవడంతో ఎక్కువ మంది చనిపోతున్నారన్నారు. సీపీఆర్ ద్వారా ఒక మనిషికి పునర్జన్మ ఇవ్వొచ్చని, దాని వల్ల రోగి చనిపోకుండా కాపాడడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ఎస్సై రాజేశ్, వైద్యాధికారులు శరణ్య, రమేశ్, సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య, ఏపీఎం వాణి పాల్గొన్నారు.

ఎట్టకేలకు ధాన్యం కొనుగోళ్లు షురూ



ఆవునూర్‌లో తూకం వేస్తున్న రైతులు

ముస్తాబాద్: వారం క్రితం ముస్తాబాద్ మండలం అంతటా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా, ఒక్క కిలో ధాన్యం కూడా తూకం వేయలేదు. మరోవైపు మొగులు దిగులుతో అన్నదాతలు ఆగమైనారు. రైతులు, పాలకవర్గాల నుంచి వచ్చిన ఒత్తిడితో అధికార యంత్రాంగం కదిలింది. రాంరెడ్డిపల్లె, ఆవునూర్, కొండాపూర్, గూడెం, పోతుగల్ కొనుగోలు కేంద్రాల నుంచి గురువారం ధాన్యం తరలించారు. హమాలీలు తూకం వేసి, లారీల్లో ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించారు. రైతులు, మిల్లర్లను సమన్వయం చేసి ధాన్యం తూకం వేసి తరలించేలా ఏర్పాట్లు చేశామని పోతుగల్ సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపురావు తెలిపారు. నిత్యం కురుస్తున్న వానలతో రైతులు తీవ్ర నైరాశ్యంలో ఉన్నారని, వారందరికి ధైర్యం చెబుతూ ధాన్యాన్ని తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎవరు ఆందోళనకు గురికావద్దని బాపురావు విజ్ఞప్తి చేశారు.

జీపీ కార్మికుల సమ్మె నోటీసు



సమ్మె నోటీసు ఇస్తున్న జీపీ కార్మికులు

బోయినపల్లి: మండలంలోని పలువురు గ్రామ పంచాయతీ కార్మికులు గురువారం ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డికి సమ్మె నోటీసు అందచేశారు. తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మె నోటీసు అందించినటు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జీపీ కార్మికులకు న్యాయం చేయాలని వారు కోరారు.

అందుబాటులో సర్కార్ వైద్యం

- పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్
- జనరల్ ఫిజీషియన్ సేవలు
- నెలకు 6,500 మందికి వైద్య సేవలు
- జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం
- సాధారణ ప్రసవాల్లో రికార్డు



ఇళ్ల వద్ద వైద్య పరీక్షలు చేస్తున్న ఆశ కార్యకర్తలు

ఎల్లారెడ్డిపేట: గ్రామీణ ప్రాంతాల్లో అసంక్రమిత వ్యాధులతో బాధపడుతున్న ఎంతోమంది పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు లేక, తప్పని పరిస్థితుల్లో దూర ప్రాంతాలకు వెళ్లి ప్రైవేట్ ఆసుపత్రులకు లక్షలు వెచ్చించి ఇల్లు గుల్ల చేసుకుంటున్నారు. ఎంతోమంది అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొనేందుకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునీకరించడం వల్ల సమస్య పరిష్కరించవచ్చనే ఆలోచనతో మంత్రి కేటీఆర్ చొరవ చూపారు. స్థానిక పీహెచ్‌సీని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంగా మార్చడం వల్ల అదనపు వైద్య సౌకర్యాలు ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

మెరుగైన వైద్య సేవలు

జిల్లాలో ఇప్పటికీ రెండు కమ్యూనిటీ హెల్త్ కేంద్రాలుండగా, ప్రస్తుతం ఎల్లారెడ్డిపేటను కలుపుకుని ఆ సంఖ్య మూడుకు చేరింది. సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ కావడంతో ఒక ఫిజీషియన్‌తో పాటు మహిళా వైద్యురాలు, మరో వైద్యుడు అందుబాటులోకి వచ్చారు. దీంతో నెలలో 6,500 మందికి వివిధ రకాల వైద్య సేవలు అందిస్తున్నారు. అసంక్రమిత వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్ల వద్దకే వెళ్లి వారికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నారు. దీనికి తోడు సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచి కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్యం అందిస్తూ ముందుకు సాగుతున్నారు. ఆరు నెలల కాలంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 63 పైగా సాధారణ ప్రసవాలు చేసి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. ఆసుపత్రి సిబ్బంది అనేక అవార్డులు సొంతం చేసుకున్నారు.

హెల్త్ ప్రొఫైల్ పైలట్ ప్రాజెక్టు

రాష్ట్ర స్థాయిలోనే హెల్త్ ప్రొఫైల్‌లో ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌ను ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకుంది. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఉమ్మడి మండలంలో 60 రకాల పరీక్షలు నిర్వహించి ఫలితాల ఆధారంగా ఫిజీషియన్ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఎన్‌పీడీ కింద థైరాయిడ్, షుగర్, బీపీ, లీవర్, కిడ్నీ, రక్తహీనత లాంటి అసంక్రమిత వ్యాధుల తీవ్రతను గుర్తించి వారికి ఆరోగ్య కేంద్రంలోనే కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నారు. ఇలాంటి వ్యాధులు ముదిరిన 130 మందిని గుర్తించి కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు నలుగురు, లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారు ఒకరిని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. ట్యాబ్‌లలో రోగుల ఆరోగ్య పరిస్థితి వివరాలను ఎప్పటికప్పుడు సిబ్బంది అప్‌లోడ్ చేస్తున్నారు. ప్రతి నెల సుమారు 6,500 మందికి వివిధ రకాల సేవలను అందిస్తున్నారు. ఉమ్మడి మండలంలో 1,310 మంది బీపీ, 743 మంది మధుమేహం, 32 మంది క్యాన్సర్, ఐదుగురు కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. వారికి నెలనెల ఇంటికి వెళ్లి పరీక్షలు చేయడమే కాకుండా మందులు అందించి బతుకుపై భరోసాను కల్పిస్తున్నారు. దీంతో ఆరోగ్య కేంద్రంలో రోగుల తాకిడి గణనీయంగా పెరిగింది.

కొత్త భవనానికి ప్రతిపాదనలు

ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ కేంద్రంగా అప్‌గ్రేడ్ చేసిన నేపథ్యంలో రోగులకు అవసరమైన గదులు, సిబ్బంది, పరికరాలను అమర్చుకుని వైద్యం అందించే విధంగా కేంద్రానికి నూతన భవనాన్ని నిర్మించాలనే ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేశారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు చొరవతో వివిధ ఆస్పత్రుల నుంచి అవసరమైన మందులను తెప్పించి ఇప్పటికే రోగులకు అందజేస్తున్నారు. దీంతో పాటు రెండెకరాల స్థలాన్ని గుర్తించే పనిలో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు. సొంత భవనంతో పాటు పూర్తిస్థాయి వైద్య సిబ్బందిని, ఆధునిక వైద్యం అందించేందుకు పరికరాలను సమకూర్చి ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన సర్కార్ వైద్యం అందించే దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది.

మా అదృష్టం



స్థానిక పీహెచ్‌సీని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంగా మార్చడం మా అదృష్టం. ఇంతకాలం అన్ని రకాల వైద్య సేవలు అందక లక్షలు వెచ్చించి ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ తిరిగాం. ఉన్న ఆస్తులు అమ్ముకున్న పూర్తిస్థాయి వైద్యం పొందలేక కొంతమంది ప్రాణాలు విడిచారు. ఇప్పుడు అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్నారు.

– ఊసి లక్ష్మి, ఎల్లారెడ్డిపేట

ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరణ



అసంక్రమిత వ్యాధులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నాం. వైద్యాధికారుల ఆదేశాల మేరకు టీబీ, కిడ్నీ, షుగర్, బీపీ వ్యాధులతో బాధపడుతున్న వారి వద్దకే వెళ్లి ఇంటి దగ్గరనే మందులు అందిస్తున్నాం. కమ్యూనిటీ హెల్త్ కేంద్రంగా మారడంతో వివిధ రకాల వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

– అంబటి జ్యోతి, ఆశ కార్యకర్త, నారాయణపూర్

అన్ని వ్యాధులకు చికిత్స



కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ కావడంతో ఒక ఫిజీషియన్ అందుబాటులోకి వచ్చారు. అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందిస్తున్నాం. రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి రక్త నమూనాలను సేకరించి, మందులు అందిస్తున్నాం. నూతన భవన నిర్మాణానికి రెండెకరాల స్థల సేకరణ రెవెన్యూ అధికారులు పరిశీలనలో ఉంది.

– బాబు, మండల వైద్యాధికారి, ఎల్లారెడ్డిపేట

బీరప్ప పట్నాలు ప్రారంభం



బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ గ్రామ శ్రీ కృష్ణ కుర్మ యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం బీరప్ప పట్నాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. బీరప్ప కమరాతి దేవి కల్యాణంలో భాగంగా తొలిరోజు భక్తి శ్రద్ధలతో పోచమ్మ బోనాలు తీశారు. డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఒగ్గుడోలు కళాకారుల ఊరేగింపు ఆకట్టుకుంది.

బోనమెత్తిన మానాల



రుద్రంగి: మండలంలోని మానాల గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఒక్క పొద్దుతో ఇంటికొక్క బోనం వండి నెత్తిన ఎత్తుకొని గ్రామంలోని ప్రధాన వీధుల్లో డప్పు సప్పుళ్లు, బైండ్లోళ్ల ఆట పాటల మధ్య ఊరేగింపుగా పెద్దమ్మ తల్లి ఆలయానికి వెళ్లి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. 'పాడిపంటలు, పిల్లా పాపలను, గొడ్డూ గోదాను సల్లంగా సూడు తల్లీ..' అంటూ వేడుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే పెద్దమ్మ జాతర, పెద్దమ్మ, పెద్దరాజుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో రుద్రంగి వైస్ ఎంపీపీ పీసరి చిన్న భూమయ్య, సర్పంచ్ అల్లూరి మానస, తదితరులు పాల్గొన్నారు.

గ్యాడ్యుయేషన్ డే



కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌మార్గదర్శి విద్యానికేతన్ హైస్కూల్‌లో గురువారం గ్యాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. కరస్పాండెంట్ చిరంజీవి, ప్రిన్సిపాల్ సునీత పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల నిరసన ప్రదర్శన



చందుర్తి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఆవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషనరీ కాలం ముగిసినా తమను రెగ్యులర్ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందని మండల పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసనను వ్యక్తం చేశారు.

జెడ్పీ వైస్‌చెర్మన్‌కు వినతిపత్రం

ఇల్లంతకుంట: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణుకు మండలంలోని వివిధ గ్రామాల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



వినతిపత్రాన్ని సమర్పిస్తున్న నాయకులు

కోనరావుపేట: అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు గొట్టె రామచంద్రం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు తడిసిపోయి, పొలాల్లో చేతికొచ్చిన పంట రాలిపోయి కష్టాల పాలయ్యారన్నారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం, కిసాన్‌మోర్చా నాయకులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలి

ఎల్లారెడ్డిపేట: వడగండ్ల వానతో వరి పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరుతూ సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రైతులు గురువారం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎల్లారెడ్డిపేట, హరిదాస్‌నగర్ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దెబ్బతిన్న పంటలను వెంటనే పరిశీలించి నష్టం అంచనాలను ప్రభుత్వానికి సమర్పించాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొత్తపల్లిలో ప్రారంభిస్తున్న ఎంపీపీ కరుణ



సుద్దాలలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

కోనరావుపేట: మండలం సుద్దాల, మర్తనపేట, ధర్మారం, మల్కపేట, పల్లిమక్త, నాగారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్‌విండో చైర్మన్ సంకినేని రాంమోహన్‌రావు ప్రారంభించారు.

తంగళ్లపల్లి: మండలంలో బద్దెనపల్లి, సారంపల్లి, లక్ష్మీపూర్, పాపయ్యపల్లె, తాడూరు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ పడిగెల మానస ప్రారంభించారు.

గంభీరావుపేట: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ వంగ కరుణ ప్రారంభించారు.

వీర్నపల్లి: మండల కేంద్రంతో పాటు మద్దిమల్ల తండా, భూక్యతండా, గర్జన్‌పల్లి, అడవిపదిర, జవహర్ లాల్ నాయక్ తండా గ్రామాల్లో సర్పంచులు పాటి దినాకర్, మాలోత్ జవార్‌లాల్ నాయక్, భారతి, గొర్రె కరుణ, ఎడ్ల లక్ష్మీరాజం, శ్రీనివాస్ ప్రారంభించారు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ జట్టుకు అభినందన



జట్టును అభినందిస్తున్న రామకృష్ణ

వేములవాడ: కరీంనగర్‌లో ఇటీవల జరిగిన ఖేలో కరీంనగర్ జీతో కరీంనగర్ క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన వేములవాడ నియోజకవర్గం టీమ్‌కు రూ.5 వేలు క్యాష్ రివార్డును బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ గురువారం అందజేసి అభినందించారు. క్రీడలను ప్రోత్సహించేందుకు పార్టీ తరఫున క్రీడలు నిర్వహించినట్లు తెలిపారు.

పరామర్శ

ముస్తాబాద్: మండలం గూడెం గ్రామానికి చెందిన బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడు బొప్ప అంజయ్య అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నాయకులు పరామర్శించారు. బీజేపీలో చురుకైన కార్యకర్తగా అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న అంజయ్య మృతి ఆయన కుటుంబానికి, పార్టీకి తీరనిలోటన్నారు. అంజయ్య కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అంజయ్య భార్య శోభ, కుమారులు శ్రీకాంత్, కరుణాకర్, కుమార్తె స్వప్నను ఓదార్చారు. ఆయనతో పాటు సర్పంచ్ చిట్నేని సరిత, బీజేపీ నాయకులు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, ఆడెపు రవీందర్, శీలం రాజు, రవి ఉన్నారు.

హమాలీ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

కోనరావుపేట: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హమాలీ కార్మిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని హమాలీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ సమీపంలో రోడ్డు ప్రమాదంలో కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన దప్పులు రాములు అనే హమాలీ కార్మికుడు మృతి చెందగా, మరో కార్మికుడు జలంధర్ గాయాలపాలై చికిత్స పొందుతున్నాడు. గురువారం గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేద కార్మికుడు రాములు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, సీపీఎం మండల అధ్యక్షురాలు జవ్వాజి విమల, నాయకులు కిషన్, బోడ దేవయ్య, దప్పుల అశోక్, ఎర్ర దేవయ్యపాల్గొన్నారు.

ధాన్యం తూకం వేసి రైతులను ఆదుకోవాలి

ఇల్లంతకుంట: మండలంలోని గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆగమేగాల మీద ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఇప్పటి వరకు ధాన్యం తూకం వేయడం లేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గన్నారం నర్సయ్య అన్నారు. గురువారం మండలంలోని అనంతారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ స్పందించి ధాన్యం తూకాలు వేసే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు, వడగళ్ళ వర్షం కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు.ఈకార్యక్రమంలో సామ నర్సింహారెడ్డి, రాములు, శ్రీనివాస్, ఎలయ్య, ప్రభాకర్, చుక్కారెడ్డి, తిరుపతి తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఇల్లంతకుంట: మండలంలోని పొత్తూరు గ్రామానికి చెందిన గుంటి బాలవ్వ రూ.60 వేలు, బండారి మమత రూ.12 వేలు, ర్యాగటి అజయ్ రూ.13,500లు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్దం శ్రీనివాస్, ఎంపీటీసీ అశ్విని, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఉపసర్పంచ్ పర్శరాం, సిద్దం నర్సయ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు

వీర్నపల్లి: మండలం అడవిపదిర గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు గురువారం సర్పంచ్ ఎడ్ల లక్ష్మీరాజం, ఎంపీటీసీ నక్క రేణుక ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజు.కారోబార్ సురేశ్, నాయకులు పాల్గొన్నారు.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ సబ్‌స్టేషన్ పరిధి గణేశ్‌నగర్‌లో 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపడుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయినగర్, టీఆర్‌నగర్, గణేశ్‌నగర్, బల్యాలనగర్, తుక్కారావుపల్లె, వంశీకృష్ణ కాలనీ, తదితర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

తంగళ్లపల్లి: మండలం రాళ్లపేట సబ్‌స్టేషన్ మేయింటెనెన్స్ కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రాళ్లపేట, ఓబులాపూర్, మండెపల్లి గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీ వార్షికోత్సవం



సిరిసిల్లటౌన్ /వేములవాడరూరల్/కోనరావుపేట /తంగళ్లపల్లి/ఎల్లారెడ్డిపేట: అంగన్‌వాడీ వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతం, పిల్లలకు, బాలింతలకు పోషకాహారాలపై అవగాహన కల్పించారు. సిరిసిల్ల సుభాష్‌నగర్, తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లి, ఎల్లారెడ్డిపేట మండలం సింగారం, అక్కపల్లి, రాచర్లతిమ్మాపూర్, ఆగ్రహారం, వేములవాడ మండలంలోని అచ్చన్నపల్లి, నూకలమర్రి, ఎదురుగట్ల, చెక్కపల్లి, వెంకటాంపల్లి, బాలరాజుపల్లి సెంటర్‌లలో కార్యక్రమాలు నిర్వహించారు. సీడీపీవో అలేఖ్య పటేల్, ఏసీడీపీవో సుచరిత, సూపర్‌వైజర్లు దివ్య, సుష్మిత, నిర్మలాదేవి, మోతె సరిత, కళావతి, పోషక అభియాన్ కోఆర్డినేటర్ రాజుకుమార్, మున్సిపల్ కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ, అంగన్‌వాడీ టీచర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

బోయినపల్లి: హమాలీ కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 29న హైదరాబాద్‌లోని లేబర్ కమిషన్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నా పోస్టరును సీఐటీయూ నాయకులు ఆవిష్కరించారు. సీఐటీయూ మండల కన్వీనర్ గురజాల శ్రీధర్, హమాలి కార్మికులు లచ్చయ్య, అంజయ్య, రమేశ్, దేవయ్య, చంద్రం, దేవరాజ్, మల్లేశం పాల్గొన్నారు.

దళిత శక్తి ప్రోగ్రాం..

బోయినపల్లి: ఈ నెల 30న హైదరాబాద్‌లో నిర్వహించే దళిత్ శక్తి ప్రోగ్రాం బహిరంగ సభ పోస్టర్‌ను డీఎస్పీ నాయకులు స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం ఆవిష్కరించారు. డాక్టర్ విశారదన్ మహారాజ్ చేపట్టిన 10 వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర ముగింపు సభకు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రోగ్రాం మండల అధ్యక్షుడు కొమ్ము విక్రమ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎడపెల్లి బాబు, ప్రతినిధులు కుర్మ సురేశ్, కుడుకల మధు, కుర్మ సంజీవ్, ఆరెపెల్లి శంకర్ పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు అండగా ప్రభుత్వం

ముస్తాబాద్: ప్రభుత్వం మహిళా సంఘాలకు అండగా ఉంటుందని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. ఎంపీపీ కార్యాలయంలో వీఓఏలతో ఎంపీపీ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇటీవల సీఎం కేసీఆర్ పావల వడ్డీని విడుదల చేశారన్నారు. అలాగే పొదుపు సంఘాల అభివృద్ధిలో విశేష కృషి చేస్తున్న వీవోఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, వీఓఏ సంఘం నాయకురాళ్లు లక్ష్మి, భాగ్య, లత, పద్మ, పర్శరాములు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం

చందుర్తి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతు సంక్షేమ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో రైతు సమస్యలను పరిష్కారించాలని కోరుతూ తహసీల్దార్ ఎండీ మజీద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు చిలుక పెంటయ్య, రైతు సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కొమటిరెడ్డి సత్తిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి వెంకట్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.